క్లుప్తంగా

ప్రసాద్‌కు ఎమ్మెల్సీ అభినందన



నెల్లూరు (టౌన్): నగరంలోని కృష్ణచైతన్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్‌లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న మాముడూరు ప్రసాద్‌కు డాక్టరేట్ లభించింది. మార్కెటింగ్ స్ట్రాటజీస్ ఇన్ బ్యాంకింగ్ ఇండస్ట్రీ.. ఏ స్టడీ విత్ రెఫరెన్స్ టు సెలక్టెడ్ పబ్లిక్ అండ్ ప్రైవేట్ సెక్టార్ బ్యాంక్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్ అనే అంశంపై ప్రొఫెసర్ సాయికుమార్ పర్యవేక్షణలో పరిశోధన చేశారు. ఈ క్రమంలో డాక్టరేట్‌ను జేఎన్టీయూ అనంతపురం ఆధ్వర్యంలో ప్రదానం చేశారు. ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి, కళాశాల డైరెక్టర్లు కృష్ణారెడ్డి, రాణా ప్రమోద్‌రెడ్డి తదితరులు అభినందనలను తెలియజేశారు.

విశ్రాంత ఇంజినీర్లకు సత్కారం

నెల్లూరు రూరల్: ఇంజినీర్స్ డేను పురస్కరించుకొని పొదలకూరు రోడ్డులోని జెడ్పీ హైస్కూల్ ఆవరణలో విశ్రాంత ఇంజినీర్లను శుక్రవారం సత్కరించారు. జెడ్పీ వాకర్స్ అసోసియేషన్లో సభ్యులైన విశ్రాంత ఇంజినీర్లు శ్రీనివాసరావు, ఆంజనేయులుశెట్టిని సన్మానించారు. వాకర్స్ డిప్యూటీ గవర్నర్ మెట్టు సుధాకర్‌రెడ్డి, ఖాజామస్తాన్, ప్రసాద్, రాజగోపాల్, అనంతరావు, హరిసుధ, పరమేశ్వరి, లక్ష్మి, పద్మ, వెంకటేశ్వర్లురెడ్డి, కొండారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ఇంజినీర్స్ డే

నెల్లూరు (పొగతోట): విశ్వవిఖ్యాత ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య అద్భుతమైన కట్టడాలను నిర్మించారని పంచాయతీరాజ్ ఎస్‌ఈ అశోక్‌కుమార్ పేర్కొన్నారు. భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య 163వ జయంతిని పురస్కరించుకొని ఇంజినీర్స్ డేను శుక్రవారం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఇంజినీర్ల సంఘం, డిప్లొమా ఇంజినీర్ల సంఘాల సంయుక్త కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో సమావేశాన్ని జెడ్పీ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. తొలుత పీఆర్ ఎస్‌ఈ కార్యాలయ ఎదుట ఉన్న విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఉద్యోగులకు నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. పీఆర్ ఈఈలు బాలసుబ్బారావు, గిరినాథ్, శ్రీనివాసులురెడ్డి, పీఆర్ డిప్లొమా ఇంజినీర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రియాజ్ అహ్మద్, ఉపాధ్యక్షుడు పరమేశలింగం, పీఆర్ ఇంజినీర్స్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ బాబూరావు, జనరల్ సెక్రటరీ సయ్యద్ మున్వర్, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, జేఏసీ నేతలు రఫీ, వెంకయ్య పాల్గొన్నారు.

నెల్లూరు(బృందావనం): గాంధీబొమ్మ సమీపంలోని స్వతంత్ర పార్కులో ఇంజినీర్స్ డేను నిర్వహించారు. కేతా సుబ్బారావు, రమణయ్య, సత్యనారాయణ, పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన అవసరం

నెల్లూరు రూరల్: పౌష్టికాహారంపై అవగాహన అవసరమని నెల్లూరు అర్బన్ సీడీపీఓ అన్నపూర్ణ పేర్కొన్నారు. అంబాపురం సెక్టార్ పరిధిలోని బుజబుజనెల్లూరు నాగమ్మకాలనీలో గల అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలను శుక్రవారం నిర్వహించారు. అనంతరం వైఎస్సార్ పోషణ కిట్లను అందజేశారు. సెక్టార్ సూపర్‌వైజర్ స్వరూప, అంగన్‌వాడీ కార్యకర్తలు అరుణ, ఏకాశమ్మ, భవానీ, నాగభూషణమ్మ, రాజేశ్వరి పాల్గొన్నారు.

• కందమూరులోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో సౌత్‌మోపూరు సెక్టార్ సూపర్‌వైజర్ నాగలక్ష్మీదేవమ్మ పాల్గొన్నారు.

వివరాలను గోప్యంగా ఉంచాలి

నెల్లూరు(సెంట్రల్): హెల్త్ సర్వేలో భాగంగా ప్రజల నుంచి సేకరిస్తున్న వివరాలను అత్యంత గోప్యంగా ఉంచాలని డీఈఎంఓ శ్రీనివాసరావు ఆదేశించారు. నెల్లూరులోని జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో ఆశ నోడల్ అధికారులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హెల్త్ సర్వే వివరాలు, ప్రాధాన్యాన్ని ప్రజలకు తెలియజేయాలని సూచించారు. అనంతరం ఆయుష్మాన్‌భవపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యశాఖ అధికారులు కనకరత్నం, సహన, మంజుల, సునీత తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీలకు అండగా కేంద్ర ప్రభుత్వం

నెల్లూరు(మినీబైపాస్): మైనార్టీలకు కేంద్ర ప్రభుత్వం పూర్తి సహాయ, సహకారాలను అందిస్తోందని బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు బాజీ పేర్కొన్నారు. ఈ మేరకు పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. మైనార్టీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు అబ్దుల్ షఫీఉల్లా, జాతీయ మైనార్టీ కార్యవర్గ మాజీ సభ్యుడు అబ్దుల్ రెహమాన్, రాష్ట్ర కోశాధికారి షాజహాన్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయమూర్తికి పదోన్నతి

నెల్లూరు (లీగల్): నెల్లూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వర్తిస్తున్న బాలాజీని పదోన్నతిపై గుంటూరు జిల్లా బాపట్ల ఆరో అదనపు జిల్లా జడ్జిగా బదిలీ చేశారు. తూర్పు గోదావరి జిల్లా పెద్దాపురం సీనియర్ సివిల్ జడ్జి సరస్వతిని పదోన్నతిపై నెల్లూరు ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తిగా నియమిస్తూ రాష్ట్ర హైకోర్టు శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు సంతోషకరం



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న అనిల్‌కుమార్

• ఎమ్మెల్యే అనిల్‌కుమార్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): భారత రాజ్యాంగ సృష్టికర్త అంబేడ్కర్ విగ్రహాన్ని యలమవారిదిన్నెలో ఆవిష్కరించడం సంతోషంగా ఉందని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. నగరంలోని 13వ డివిజన్లోని యలమవారిదిన్నెలో గల వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ వద్ద అంబేడ్కర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే శుక్రవారం ఆవిష్కరించారు. దాదాపు రూ.30 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. మాజీ కార్పొరేటర్ ఊటుకూరు మాధవయ్య, ఆయన కుమారుడు, కార్పొరేటర్ నాగార్జున ప్రత్యేక కృషితో విగ్రహాన్ని ఏర్పాటు చేశారని, సహకరించిన దాతలు, ప్రజలకు కృతజ్ఞతలను తెలియజేశారు. నగరాభివృద్ధిలో రాజీపడేది లేదని చెప్పారు. డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

'నారాయణ'లో ఉత్సాహంగా కాంపిటీషన్స్



నెల్లూరు (టౌన్): ఇంజినీర్స్ డేను పురస్కరించుకొని నగరంలోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో ఆంధ్రా టెక్ లీగ్ కాంపిటీషన్స్‌ను టెక్ టీమ్ సొల్యూషన్స్, విశాఖపట్నం జోనల్ సెంటర్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఏడు నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు.. ఇంజినీరింగ్ విద్యార్థులను రెండు గ్రూపులుగా విభజించి పోటీలను జరిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి మాట్లాడారు. రోబోటిక్స్, డొమైన్స్, 3డీ ప్రింటింగ్, యంత్రయాన్, డిజైన్ థింకింగ్ అండ్ కోడింగ్ అంశాలపై పోటీలను నిర్వహించామని వివరించారు. అనంతరం సైకిల్ ర్యాలీని మెకానికల్ ఇంజినీరింగ్ విభాగ ఆధ్వర్యంలో జరిపారు. టెక్ టీమ్ సొల్యూషన్స్ ప్రతినిధి ప్రదీప్, హెచ్‌ఆర్ మేనేజర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

నిమజ్జనానికి పటిష్ట ఏర్పాట్లు చేయాలి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

• ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు(బృందావనం): వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా గణేశ్ విగ్రహాల నిమజ్జన సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికార యంత్రాంగం పటిష్ట ఏర్పాటు చేయాలని ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయ సమీపంలోని గణేశ్ నిమజ్జన ఘాట్ వద్ద ఏర్పాట్లను వివిధ శాఖల అధికారులతో కలిసి ఎంపీ శుక్రవారం పరిశీలించారు. అనంతరం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వర్ణాల చెరువు వద్ద వ్యర్థాలను మూడు పొక్లయిన్లతో తొలగిస్తున్నారని వివరించారు. గణేశ్ ఘాట్‌లో తూర్పు, దక్షిణం వైపున నిమజ్జనం చేసేందుకు అధికారులు చక్కగా ఏర్పాట్లు చేస్తున్నారని చెప్పారు. స్వర్ణాల చెరువులో మరో అడుగు ఎత్తు నీరు పెంచేందుకు ఇరిగేషన్ అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. ఊరేగింపు సందర్భంగా పోలీస్ అధికారులు బందోబస్తు ఏర్పాట్లను చేపట్టాలన్నారు. నిమజ్జనానికి నిధులు అవసరమైతే విడుదల చేసేందుకు కమిషనర్ సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, కమిషనర్ వికాస్ మర్మత్, దేవదాయ శాఖ జిల్లా అధికారి శ్రీనివాసరావు, కార్పొరేటర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు (దర్గామిట్ట): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో పలువురు మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిశారు. పార్టీ సాంస్కృతిక విభాగ జిల్లా అధ్యక్షుడు నారాయణ బాబు ఆధ్వర్యంలో జిల్లా డ్యాన్స్ మాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఎంపీని సత్కరించారు. అసోసియేషన్ ప్రెసిడెంట్ జహీర్, సెక్రటరీ జనార్దన్, వైస్ ప్రెసిడెంట్ సాయి పాల్గొన్నారు.

• ఎంపీని ఆలిండియా పోస్టల్ ఎంప్లాయీస్ యూనియన్ నెల్లూరు సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. నెల్లూరులో ఇటీవల నిర్వహించిన ద్వైవార్షిక మహాసభలు విజయవంతమైన నేపథ్యంలో ఆయన్ను సత్కరించారు. నెల్లూరు డివిజన్ ఏఐపీఈయూ గ్రూప్ సీ అధ్యక్షుడు హరి, నెల్లూరు డివిజన్ ఏఐపీఈయూ పోస్ట్‌మెన్, ఎమ్టీఎస్ యూనియన్ ప్రెసిడెంట్ పెంచలయ్య పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో ఉద్యమం



మాట్లాడుతున్న నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం అన్ని ప్రజా సంఘాలతో కలిసి జాతీయ ఉద్యమాన్ని కొనసాగిస్తామని కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (సీడబ్ల్యూఎఫ్‌ఐ) జాతీయ ఉపాధ్యక్షుడు సాయిబాబా పేర్కొన్నారు. నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో సీడబ్ల్యూఎఫ్‌ఐ వర్కింగ్ కమిటీ సమావేశాలను శుక్రవారం ప్రారంభించారు. సమావేశాలకు 18 రాష్ట్రాల నుంచి భవన నిర్మాణ కార్మిక సంఘ ప్రతినిధులు హాజరయ్యారు. భవన నిర్మాణ కార్మిక సంఘ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఉమామహేశ్వరరావు, జిల్లా కార్యదర్శి అల్లాడి గోపాల్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్, నగర కార్యదర్శి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి వక్తృత్వ పోటీలు

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లా స్థాయి వక్తృత్వ పోటీలను కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని జిల్లా యువజన అధికారి మహేంద్రరెడ్డి పేర్కొన్నారు. మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్‌శాస్త్రి జయంతిని పురస్కరించుకొని పార్లమెంట్ భవన్‌లో అక్టోబర్ 2న నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంలో ఉపన్యసించేందుకు 25 మంది యువతకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తోందని చెప్పారు.

జిల్లా స్థాయిలో శుక్రవారం నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో ప్రథమ స్థానంలో రమ్య నిలిచారని, ఆమెను రాష్ట్ర స్థాయికి పంపనున్నామని తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం రేపు



నెల్లూరు(మినీబైపాస్): గండిపాళెంలోని ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించనున్నామని రూబీ కమిటీ సభ్యుడు రమేష్ పేర్కొన్నారు. ఈ మేరకు నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడారు. కార్యక్రమానికి పూర్వ విద్యార్థులు హాజరుకావాలని కోరారు.

వాత్సల్య అనాథాశ్రమానికి చేయూత



నెల్లూరు (టౌన్): విశ్వసాయి – ఎస్సార్కే స్కూల్ విద్యార్థులు సేకరించిన నిత్యావసర సరుకులను బీవీనగర్‌లోని వాత్సల్య అనాథాశ్రమ నిర్వాహకులకు అందజేశారు. విద్యార్థులను స్కూల్ చైర్మన్ సత్యనారాయణ, డైరెక్టర్ కృష్ణమోహన్ అభినందించారు. ప్రిన్సిపల్ రఘురామ్ పాల్గొన్నారు.

నేత్రపర్వంగా లక్ష కుంకుమార్చన

నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో లక్ష కుంకుమార్చనను భక్తిశ్రద్ధలతో శుక్రవారం నిర్వహించారు. మూలవర్లు, అనివెట్టి మండపంలో విశేషాలంకారంలో కొలువైన అమ్మవారికి విశేష పూజలను ప్రధానార్చకుడు సూరావఝుల రఘురామశర్మ ఆధ్వర్యంలో జరిపారు. ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ రత్నం జయరామ్, సభ్యులు దొరబాబు, రామ్మోహన్‌రెడ్డి, సతీష్, పెంచలమ్మ, భారతి, నాగమణి, విజయకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

• సుజాతమ్మ కాలనీలోని కృష్ణయోగ మందిర ప్రాంగణంలో గల అష్టలక్ష్మి ఆలయంలో చండీ హోమం, ధనలక్ష్మీ కుబేర పూజ, పల్లకిసేవ, మహా హారతులను విశేషంగా నిర్వహించారు. ఉభయకర్తలుగా బాలసుధాకర్ దంపతులు వ్యవహరించారు. మందిర ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా విధులు నిర్వర్తించాలి

నెల్లూరు(క్రైమ్): క్రమశిక్షణ, అంకితభావంతో విధులను నిర్వర్తించాలని ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి సూచించారు. నగరంలోని పోలీస్ కవాతు మైదానంలో సిబ్బంది శుక్రవారం నిర్వహించిన కవాతును పరిశీలించి గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనధికారికంగా విధులకు గైర్హాజరుకావొద్దని, లేని పక్షంలో ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లను కోల్పోతారని సిబ్బందికి సూచించారు. అనంతరం పోలీస్ సిబ్బంది సమస్యలపై గ్రీవెన్స్‌ను నిర్వహించారు. ఏఎస్పీ క్రైమ్స్, ఏఆర్ ప్రసాద్, శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ గాంధీ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని పలు సబ్‌స్టేషన్లలో మరమ్మతులు, తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా శనివారం ఉండదని నెల్లూరు టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సోమశేఖర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంజీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని నీలగిరి సంఘం ఫీడర్‌లో గల నూతన ఎస్పీ కార్యాలయం, బట్వాడిపాళెం, నీలగిరి సంఘం తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని చెప్పారు.

• ఏకేనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని పోస్టల్ కాలనీ ఫీడర్‌లో చెట్ల కొమ్మలను తొలగించనున్న నేపథ్యంలో పోస్టల్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదన్నారు.

• కోటమిట్ట సబ్‌స్టేషన్ పరిధిలోని జెండావీధి ఫీడర్‌లో వైర్లను మార్చనున్న నేపథ్యంలో జెండావీధి, కోటమిట్ట తదితర ప్రాంతాల్లో ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం రెండు వరకు సరఫరా ఉండదని వివరించారు.

• జగదీష్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్న తరుణంలో ఉమ్మారెడ్డిగుంట, రాఘవేంద్రనగర్, డీ మార్ట్, వనంతోపు తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

నేటి నుంచి గణపతి విగ్రహాల పంపిణీ

నెల్లూరు(బృందావనం): గాంధీబొమ్మ సమీపంలోని వెంకట్రామా షాపీ – శ్రీశ్రీ ఏజెన్సీస్‌లో మట్టి గణపతి విగ్రహాలను శనివారం నుంచి ఉచితంగా పంపిణీ చేయనున్నామని నిర్వాహకుడు శ్రీపతి శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పలువురు ప్రముఖులు హాజరై వీటిని పంపిణీ చేయనున్నారని వివరించారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ ర్యాలీ

నెల్లూరు (టౌన్): వినాయక చవతి సందర్భంగా మట్టి వినాయకుడి ప్రతిమలను పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలని ప్రభుత్వ ఆదర్శ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు కోరారు. సంతపేటలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ ర్యాలీని శుక్రవారం నిర్వహించారు. స్కౌట్స్ మాస్టర్ వెంకటేశ్వర్లు, పుల్లయ్య, పెంచలరెడ్డి, మోహన్‌రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ పోటీలకు నెల్లూరు బాలిక

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు నగరానికి చెందిన బాలిక నిస్సీ అభిరూప ఎంపికైంది. నెల్లూరు ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్ – 14 ఎంపికల్లో అభిరూప ఉత్తమ ప్రతిభ చూపింది. ఈ క్రమంలో కర్ణాటకలోని బెళగావిలో నిర్వహించనున్న జాతీయ పోటీల్లో రాష్ట్ర జట్టు తరపున ప్రాతినిధ్యం వహించనుందని సాయి మిలీనియం స్కూల్ కరస్పాండెంట్ రామిరెడ్డి తెలిపారు.

ట్రాఫిక్ అవుట్‌పోస్ట్ ప్రారంభం

నెల్లూరు(క్రైమ్): ఆత్మకూరు బస్టాండ్ వద్ద నార్త్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ అవుట్‌పోస్ట్‌ను నగర ట్రాఫిక్ డీఎస్పీ అబ్దుల్ సుభాన్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నగర ప్రజలకు మెరుగైన ట్రాఫిక్‌ను అందించేందుకు ఎస్పీ పర్యవేక్షణలో పటిష్ట చర్యలు చేపడుతున్నామని చెప్పారు. డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలను రోజూ నిర్వహిస్తున్నామని, పట్టుబడితే రూ.10 వేల జరిమానాతో పాటు జైలుశిక్ష తప్పదన్నారు. ట్రాఫిక్ అవుట్‌పోస్ట్‌లో సిబ్బంది అందుబాటులో ఉండటంతో పాటు ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు తగు చర్యలు చేపడతారని వివరించారు. నార్త్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శివాజీ తదితరులు పాల్గొన్నారు.

గృహాలను లబ్ధిదారులకు అందజేయాలి

నెల్లూరు సిటీ: నిర్మాణం పూర్తయిన గృహాలను లబ్ధిదారులకు వెంటనే అందజేయాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. వెంకటేశ్వరపురంలోని జగనన్న కాలనీని శుక్రవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఇక్కడ అవసరమైన మంచినీటి కుళాయి కనెక్షన్లు, విద్యుత్ మీటర్లు, రోడ్ లెవలింగ్ పనులు, తదితర మౌలిక వసతులను కల్పించాలని ఆదేశించారు. రూఫ్ నిర్మాణాలు పూర్తయిన గృహాలకు పొదుపు ద్వారా వడ్డీ లేని రుణాన్ని అందించి, ఫినిషింగ్ పనులను పూర్తి చేయాలని పేర్కొన్నారు.

• మూలాపేట, బారకాసు తదితర ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలను కమిషనర్ పరిశీలించారు. కేంద్రాల్లో మౌలిక వసతులపై ఆరాతీశారు.

ప్రభుత్వాస్పత్రుల్లో అన్ని సౌకర్యాలు

నెల్లూరు(సెంట్రల్): ప్రభుత్వ హాస్పిటళ్లలో అన్ని సౌకర్యాలను కల్పించారని అధికారులు తెలిపారు. విజయనగరంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రారంభ కార్యక్రమాన్ని నెల్లూరులోని మెడికల్ కళాశాల నుంచి వైద్యశాఖ అధికారులు శుక్రవారం వీక్షించారు. ఈ సందర్భంగా జీజీహెచ్ సూపరింటెండెంట్ నరేంద్ర, మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ జమున మాట్లాడారు. వైద్య రంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని వివరించారు. అనంతరం డీఎంహెచ్‌ఓ పెంచలయ్య మాట్లాడారు. ప్రభుత్వాస్పత్రుల్లో అన్ని వసతులను కల్పించామని చెప్పారు. హాస్పిటల్ అభివృద్ధి కమిటీ కో ఆర్డినేటర్ లక్ష్మీసునంద మాట్లాడుతూ.. ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పేదలకు మెరుగైన వైద్యం అందుతోందని తెలిపారు. మరికొన్ని విభాగాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందన్నారు.